పల్లెల్లో సంక్రాంతి సందడి



కాకినాడ రూరల్ మండలంలో నిర్వహిస్తున్న కోడి పందేలు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

- రంగవల్లుల్లో పోటీపడిన మహిళలు, యువతులు
- కోడి పందేల్లో మగవారి జోష్

కాకినాడ రూరల్: తెలుగింట పెద్ద పండగ సంక్రాంతిని రూరల్ నియోజవర్గంలో ఘనంగా నిర్వహించారు. బంధువులు, కొత్త అల్లుళ్లు, ఆడపడుచుల రాకతో గ్రామాల్లో ప్రతి ఇంట సంక్రాంతి సందడి నెలకొంది. మూడు రోజులూ పండగల్లో భాగంగా సోమవారం సంక్రాంతిని ఘనంగా చేసుకున్నారు. పెద్దల పండగ అని పిచుకునే సంక్రాంతి నాడు తమ పూర్వీకులు, పెద్దలను స్మరించుకుని వారి పేరిట వస్త్ర దానం చేశారు. మహిళలు సంప్రదాయ పిండి వంటలు అరిసెలు, పొంగడాలు, పాకుండలు, సున్నుండలు, జంతికలు తదితర వంటకాలు తయారీతో వంటింటికే చాలా వరకు పరిమితమయ్యారు. తమ వీధుల్లో నిర్వహించే రంగవల్లులు పోటీల్లో వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగరవేస్తూ, ఆట పాటలతో కాలక్షేపం చేయగా మగవారు మాత్రం సంక్రాంతిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే కోడిపందాలతో కాలక్షేపం చేశారు. కాకినాడ రూరల్‌లో పలు గ్రామాలలో కోడి పందాలు సందడి చేశాయి. మాంసాహార ప్రియులు కోస మాంసం కోసం ఎగపడ్డారు. మంగళవారం కనుమ పండగ నాడు కోడి పందేలు సందడి చేసి సాయంత్రంతో ముగిశాయి. బుధవారం ముక్కనుమతో సంక్రాంతి పండగ ముగియనుంది.

నగరంలో ఘనంగా కనుమ పండుగ

బోట్‌క్లబ్: కనుమ పండుగను మంగళవారం నగర ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకొన్నారు. కొత్త దుస్తులు వేసుకొని దేవుడి దర్శనం కోసం నగరంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలసి, సినిమాలకు వెళ్లడంతో నగరంలోని పలు థియేటర్లు సందర్శకులతో కిటకిటలాడాయి. స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వెంకట్‌నగర్‌లోని వేంకటేశ్వస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు, గాంధీనగర్, జగన్నాథపురంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్యం

కాకినాడ రూరల్: కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లోని శిల్పారామం వద్ద సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్యం అలరించింది. శ్రీవాగ్దేవి నృత్య నికేతన్ చెందిన కళాకారుణిలు, చిన్నారులు తమ నృత్యాలలో సభికులను రంజింప చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన ప్రార్థన గీతం అనంతరం నటరాజ స్వామి ఆశీస్సులతో సుమారు రెండు గంటల పాటు కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ఆద్యశ్రీ, గంగ, ఉమామహేశ్వరి, లతిక, పల్లవి, రుచి, వేదిక్, నిస్సిప్రియ, ప్రణవి, దీక్షిత, దియా తదితరులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. శ్రీభక్తాంజనేయ సురుచి ఫుడ్స్, హోమ్ బైట్ సహకారంతో వీరికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను శిల్పారామం పరిపాలన అధికారి టి.సూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీవాగ్దేవి నృత్య నికేతన్ కార్యదర్శి తేజేశ్వరరావు, నాట్యాచారిణి కల్యాణి, శిల్పారామం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు బహూకరిస్తున్న శిల్పారామం ఏఓ సూర్యప్రకాష్

క్లుప్తంగా

ఘనంగా జాతీయ సైనిక దినోత్సవం



మాజీ సైనికులను సన్మానిస్తున్న అడబాల ట్రస్ట్ ఛైర్మన్ రత్నప్రసాద్

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో 76వ జాతీయ సైనిక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు ఎస్‌డీ రామారావు మాట్లాడుతూ మన దేశాన్ని సురక్షితంగా ఉంచడానికి భారత సైన్యం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం మాజీ సైనికులు రామారావు, శ్రీనగేష్‌లను అడబాల రత్నప్రసాద్ ఘనంగా సన్మానించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

కాకినాడ క్రైం: తనపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడంటూ గాయాలతో ఓ వ్యక్తి మంగళవారం సాయంత్రం కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. ఈ ఘటనపై డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆరా తీస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, కాకినాడ గ్రామీణం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన వెనిగంటి వెంకటేష్ అనే 25 ఏళ్ల వ్యక్తి మంగళవారం పొలానికి వెళ్లి వస్తుండగా ఓ వ్యక్తి వెనుక నుంచి కత్తితో వీపులో పొడిచాడు. సదరు వ్యక్తిది ఇంద్రపాలెం అని, కొన్నాళ్ల క్రితం పరిచయం అయ్యాడని, తనని అన్న అంటూ పిలిచేవాడని బాధితుడు పోలీసులకు తెలిపాడు. తనపై దాడి చేసిన వ్యక్తి పేరు తెలీదంటూ గుర్తులు చెప్పాడు. బాధితుడి వాంగ్మూలం ఆధారంగా ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న త్రిమూర్తిస్వామి

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరంలో లోవసూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మందికి దుప్పట్లు, ఆహార ప్యాకెట్లను సంస్థ ఛైర్మన్, సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి మంగళవారం పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులు చోడిశెట్టి లోవరాజు, సూర్యకాంతం జ్ఞాపకార్థం వృద్ధులకు దుప్పట్లు, భోజనాలు అందించామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు.

ఘనంగా ముగిసిన ధనుర్మాసోత్సవాలు

పిఠాపురం: నియోజకవర్గంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా ముగిశాయి. నెల రోజుల నుంచి వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, గోదాదేవి కల్యాణాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమ, మంగళవారాల్లో పంచమాధవ క్షేత్రమైన కుంతీమాధవస్వామి, వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఆయా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ ఈఓ తెలిపారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

గండేపల్లి: మురారి కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కనుమ రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించారు.

దాత ఆశయాల మేరకు సేవలు

- రాష్ట్ర రైస్ మిలర్ల సంఘం అధ్యక్షుడు వీరభద్రారెడ్డి
- ఘనంగా అన్నదాన సమాజం వ్యవస్థాపక దినోత్సవం

బోట్‌క్లబ్: దాత ఆశయాలకు అనుగుణంగానే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. కోకనాడ అన్నదాన సమాజం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం సినిమా రోడ్డులోని అన్నదాన సమాజంలో దాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి వస్త్ర దానం చేశారు. అన్నదానం సమాజం ఛైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాకినాడ నగరంలో నిత్యం నిరుపేదలకు అన్నదానం చేయాలనే ఉద్దేశంతో దాతలు ఆర్‌వీకేఎం సూర్యారావు బహదూర్, కోట లక్ష్మయ్యనాయుడు ఈ అన్నదాన సమాజాన్ని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నిత్యం ఎంతమంది నిరుపేదలు వచ్చినా వారికి అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం బ్రాహ్మణులకు స్వయంపాకం, పేదలకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, దేవదాయశాఖ డీసీ కార్యాలయం సూపరిండెంటెంట్ నాగేశ్వరావు, అన్నదానం సమాజం ఈఓ ఆర్‌వీ చందన పాల్గొన్నారు.



వస్త్రదానం చేస్తున్న రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి

సర్వదేవతా స్వరూపం గోమాత

బోట్‌క్లబ్: నగరంలోని పలు ఆలయాల్లో మంగళవారం గోపూజ వైభవంగా నిర్వహించారు. పశువుల పండగగా ప్రసిద్ధిగాంచిన కనుమ రోజున గోమాతను పూజిస్తే సకల సుఖాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఈ పూజలు నిర్వహించారు. దీంతో ఉదయం నుంచి ఆలయాల వద్ద సందడి నెలకొంది. గోమాత సర్వ దేవతా స్వరూపమని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ పెద్ది రత్నాజీ అన్నారు. గోపూజలో భాగంగా ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. గోసేవ చేసే వారికి గ్రహదోష నివారణ, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. గోసేవ, గోదానం సర్వపాప హరణమన్నారు. దేశం, వంశం, కుటుంబం అభివృద్ధి జరగాలంటే గో సంరక్షణే తక్షణ కర్తవ్యమన్నారు. గోమయం, గోమూత్రం ఇవన్నీ కూడా యావత్ మానవాళికి ఆరోగ్యకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హిందూ సాంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో గోపూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పండితులు ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గోవును పూజిస్తే సకల దేవతలను పూజించినట్లే అన్నారు. దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో గోపూజ నిర్వహించారు.



బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గోపూజ చేస్తున్న అధికారులు, పండితులు

పదిలంగా గట్టెక్కేలా..

- పది ఫలితాల్లో ప్రథమ స్థానానికి శిక్షణ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- జిల్లా విద్యాశాఖ ప్రత్యేక పర్యవేక్షణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఉపాధ్యాయులకు టెన్షన్ మొదలైంది. ఎవరికి వారు మంచి ఫలితాల సాధనకు పనిచేస్తున్నారు. గతేడాదిలాగే ఈ సారి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు నగరంతో పాటు రూరల్ పరిధిలో 3500 మంది హాజరవుతున్నారు. ఇటీవలే సమ్మెటివ్ ఆధారంగా విద్యార్థులను గ్రేడులుగా విభజించారు. ఎస్సీఈఆర్‌టీ బ్లూప్రింట్ ఆధారంగా సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించడంతో పబ్లిక్ పరీక్షలకు సబ్జెక్టుల వారీగా అనుసరించాల్సిన వ్యూహాలను విద్యార్థులకు మార్గదర్శకం చేసేలా ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు.

ప్రతి విద్యార్థీ దత్తత..

ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిని దత్తత తీసుకోనున్నారు. గతంలో వెనుకబడిన విద్యార్థుల విషయంలో ఇలా ఆచరించేవారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అన్ని రకాల గ్రేడుల్లో ఉన్న వారిని సమానంగా దత్తత తీసుకుంటారు. పరీక్షల సమయంలో వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.

95 శాతం సిలబస్ పూర్తి..

ఈ నెలాఖరు నాటికి 95 శాతం సిలబస్ పూర్తిచేసి మళ్లీ అన్ని ఒకసారి రివిజన్ చేసేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సబ్జెక్టు నిపుణులతో సబ్జెక్టుల వారీగా సదస్సులు నిర్వహిస్తారు.

పాఠశాలలో ప్రత్యేకంగా..

పాఠశాలల్లో వారానికి ఒకరోజు ఉపాధ్యాయులు సమీక్షించుకోవాలి. సబ్జెక్టుల వారీగా గ్రేడులను విశ్లేషిస్తూ ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యాశాఖకు పంపించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సైతం ప్రతిరోజు ఒక తరగతిని బోధించనున్నారు.

తల్లిదండ్రులతో సమావేశం..

తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం, ఆహారం, టీవీ విషయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వనున్నారు.

ప్రత్యేక పర్యవేక్షణ..

ప్రణాళిక అమలుకు పాఠశాలలపై పర్యవేక్షణ ప్రధానమైనది. ఉపాధ్యాయులకు అత్యవసర సమయాల్లో తప్ప సెలవులు ఇవ్వకూడదని ఆదేశాలిచ్చారు. డీఈవో, డీవైఈఓ కాకుండా సెక్టోరియల్ అధికారులు, సీనియర్ ఉపాధ్యాయులతో కూడిన కమిటీ ద్వారా తనిఖీలు నిర్వహిస్తారు.

పిల్లలకు కౌన్సెలింగ్..

పిల్లలను అన్ని విధాలా ప్రోత్సహించేలా కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. సగటు మార్కుల కన్నా తక్కువగా ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరీక్షల చివరి వరకూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తారు. రాత్రి వేళల్లో బాలికలు ఇంటికి వెళ్లడానికి ఆలస్యం అయితే తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు సహకరిస్తారు.



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రతిరోజు టెస్టులు నిర్వహిస్తున్నాం



పదో తరగతి పరీక్షల విద్యార్థులకు ప్రతిరోజూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా పేపర్ పంపించి పరీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే స్టడీ మెటీరియల్ పంపించి హెచ్‌ఎం తరగతి బోధించేలా ఆదేశాలు జారీ చేశాం. – జి.నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి

అక్రమ మద్యం స్వాధీనం



పట్టుబడ్డ మద్యం సీసాలు, నిందితుడు జయరాంతో సీఐ వెంకటేశ్వరరావు బృందం

కాకినాడ క్రైం: పండగ వేళ భారీ మొత్తాలకు విక్రయించేందుకు నిల్వ చేసిన అక్రమ మద్యం సెబ్ బృందం ముమ్మర తనిఖీలలో పట్టుబడింది. సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లు సత్ఫలితాలు ఇచ్చాయని సెబ్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కాకినాడ పరిధిలో కొత్తపేట మార్కెట్‌లో నివాసం ఉంటున్న గంగుమళ్ల జయరాం అనే వ్యక్తి తన ఇంట్లో మద్యం సీసాలు భద్రపరిచి కోడి పందేలు నిర్వహించే బరుల్లో అధిక మొత్తానికి విక్రయించేందుకు సిద్ధం చేశాడు. విశ్వసనీయ సమాచారంతో సీఐ వెంకటేశ్వరరావు బృందం తనిఖీలు చేసి 50 నిబ్‌లను స్వాధీనం చేసుకుంది. అలాగే, కాకినాడ గ్రామీణ మండలం నేమం గ్రామంలో వాసంశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తి నుంచి 19 నిబ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురు నిందితులనీ కాకినాడ నార్త్ సెబ్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రయాణికుల భద్రతే ప్రధానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎం కిరణ్‌కుమార్

తుని: ఆర్టీసీ ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా బస్సులను నడపాలని తుని డిపో మేనేజర్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ స్థానిక డిపో ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. మాసోత్సవాలు వచ్చే నెల 14 వరకు కొనసాగుతాయన్నారు. ఏఎంటీ జీజీవీ రమణ, గ్యారేజ్ ఇన్‌చార్జి ప్రసాద్, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సు : ఈ నెల 17న హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు డీఎం ఎస్.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తుని డిపోలో బుధవారం రాత్రి 7.30కు అల్ట్రా డీలక్స్ (90489) సరీస్ బస్సు బీహెచ్‌ఈఎల్ (హైదరాబాద్) బయలుదేరుతుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం ఉందన్నారు.

మకర జ్యోతి దర్శనం



నాగులపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయం

కొత్తపల్లి : అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం పరమ పవిత్రమని భక్తులు భావిస్తున్నారు. స్థానికంగా ఉన్న ధర్మశాస్తా, నాగులపల్లిలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం స్వామికి ఆభరణాల అలంకరణ, అనంతరం జ్యోతి దర్శనం ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

- మంచు పరదా మాటున..



మంచు తెరల్లో ప్రత్తిపాడు ఇందిరా కాలనీ

రెండు రోజులుగా గ్రామాలను మంచు కప్పేస్తోంది. ఉదయమైనా సూర్యుని జాడ లేకుండా, పొగమంచు ముంచేస్తోంది. ఉదయం ఏడు గంటలు దాటితేనే సూ ర్య కిరణాలు పుడమిని తాకుతున్నాయి. -ప్రత్తిపాడు

రత్నగిరిపై ఘనంగా గోపూజోత్సవం

సత్యదేవుడు, అమ్మవారికి, గోవులకు ఘనంగా పూజలు

అన్నవరం: కనుమ పండగ సందర్భంగా మంగళవారం రత్నగిరి సత్యదేవుని సన్నిధిన, కొండ దిగువన గోశాలలో గోపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పల్లకీలో ఉంచి, ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పల్లకీలోని స్వామి, అమ్మవార్లకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర పూజ, శ్రీకృష్ణుడికి సహస్రనామ పూజ నిర్వహించారు. తర్వాత గోవు పృష్ఠ భాగానికి దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ దంపతులు పూజలు చేశారు. అనంతరం గోవు చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి, వాటికి బియ్యం, బెల్లం తినిపించారు. తర్వాత గోవులకు హారతి ఇచ్చారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్లకు నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గోపూజ, ఇతర కార్యక్రమాలను దేవస్థానం వేద పండితులు గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ ఘనాపాఠీ, శివ ఘనాపాఠీ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహం, కోట సుబ్రహ్మణ్యం కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు అంగర సతీష్‌శర్మ, పాలంకి పట్టాభి తదితరులు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నగిరి సప్త గోకులంలోని గోవులకు కూడా అర్చకుడు యడవిల్లి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లతో పాటు సప్త గోకులంలో గోవులను కూడా దర్శించి పూజలు చేశారు. రిసెప్షన్ ఏఈఓ, పీఆర్‌ఓ డీవీఎస్ కృష్ణారావు, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోశాలలో.. సాయంత్రం ఐదు గంటలకు గోశాలలో కూడా గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రామచంద్రమోహన్ గోవులకు పూజలు చేసి, పిండి వంటలు, అరటిపండ్లు తినిపించారు. గోసంరక్షణపై అక్కడి సిబ్బందికి ఆదేశాలిచ్చారు.



సత్యదేవుడు, అమ్మవార్లకు పూజలు చేస్తున్న ఈఓ రామచంద్రమోహన్ దంపతులు



గోవుకు పూజ చేస్తున్న అర్చకుడు



గోశాలలో ఉన్న గోవులు